



# మూగ మోసం

రైలు మంచి వేగంలోవుంది. రైలు నిండా జనం వుంది. కూర్చోవడానికి స్థలం లేదు. నిలబడటానికి వీలు లేదు. కంపార్టుమెంటులో ఊపిరాడడం లేదు. ఉదయపు గాలి జివ్వున వీస్తోంది. తలుపు దగ్గర నిలబడితే విశ్రాంతిగా వుంటుందనుకున్నాను. వేళ్ళలేకుండా త్రోవలో బియ్యం బస్తాలు పాల డబ్బాలు (కేన్సు) వున్నాయి. దాటుకుంటూ వెళ్ళేసరికి తలుపు మూల నక్కి కూచున్న కుష్ఠి వాళ్ళు సాక్షాత్కరించారు. వెనకి తిరిగి యథాస్థానంలో యిరుగ్గా, చిరాగ్గా కూచున్నాను.

పైన బెర్త్ మీద పడుకున్నతను గట్టిగా గుర్రు కొడ్తున్నాడు. గుడ్డివాడొకడు దూరంలో నందామయా పాట పాడుతున్నాడు. చేతిలోని టిక్ టిక్ టక టక చెక్కల చప్పుడు తప్పిస్తే పాట వినిపించడంలేదు. కిటికీ దగ్గర కూర్చున్న తెల్ల బట్టల ఆసామి దిన పత్రిక చదువుతున్నాడు ఎదురుగ్గా ఓ కుర్రాడు కునికి పాట్లు పడుతున్నాడు. నా పక్కతను

మాటి మాటికి గడియారం చూసుకుంటున్నాడు. రైలు. రెండు గంటలు ఆలస్యంగా పోతోందని గుర్తు చేసి 'ఏ రేల్‌గాడీ నహీ, బేల్ గాడీ హై, అని నిశ్చయించేడు. రెండు సీట్ల మధ్య ఖాళీ స్థలంలో ఇద్దరు లంబాడీ స్త్రీలు ముల్లె మూటలతో సహా కూర్చున్నారు. వాళ్ళ భాషలో ఏదో మాట్లాడుతున్నారు. అది తిట్టుకుంటున్నారేమోనని అనుకునేట్టుగా వుంది. ఒకావిడ పిల్లకు పాలిస్తోంది. మరో వైపు ఓ ముసలాడు గొంగడి, కర్రతో కిటికీ వద్దకు వెళ్ళి, అద్దం లేపి, బయటకు ఊంచి మళ్ళీ, నింపాదిగా చుట్ట పీలుస్తున్నాడు.' ఎవరయా ఊంచేది, బుద్ది లేకుండా, ఇక్కడ మీద పడ్తాంది." వెనక వైపు నుండి తిట్లు సరఫరా అవుతున్నాయి. అన్నిటినీ సహించి కడుపులో వుంచుకొని ఢక ఢక ఢకా - ఢక ఢక ఢకా-రైలు బీబీనగర్ బ్రిడ్జ్ దాటేస్తోంది

అందర్నీ దాటుకుంటూ ఓ ముసల్ది వచ్చింది దాని చేతిలో వున్న పసుపూ, ఎరుపూ రంగు అట్ట ముక్కల్ని అక్కడ వున్న అందరికీ పంచింది. నోరు లేదని, మూగ దాన్నని చేతి సైగలతో పరిచయం చేసుకుంది చిల్లర వేయమని అర్థించింది. దండం పెట్టింది. ముఖం దీనంగా పెట్టింది-మిగిలిన అట్ట ముక్కలు పంచడానికి ముందుకు సాగింది. దగ్గరున్న తెల్లబట్టల ఆసామి అట్టముక్క చూడకుండానే దొంగముండ అని తిట్టుకుంటూ నవ్వుకుని పేపర్లోకి కొంచెం సేపు చూసాడు ఏదో జ్ఞాపకం రాగానే అక్కడున్న అందరి నుండి అట్ట ముక్కల్ని అడిగి తీసుకుని పత్రిక మధ్యలో పెట్టి దాచి పెట్టాడు.

"దీని సంగతేరికేనా మీకు" అడిగాడు.

లేదన్నట్లు తలూపాను.

"రోజూ మాట్లాడియ్యాలను కుంటున్నగని, కుదుర్తలేదు.. ఇయ్యాల్లది మాట్లాదేదాక దాని ఈ కారట్లియ్య. దానికి మాటలొస్తయి

అన్నా న్రయి సార్ అంత మోసం! మొగడు అన్నదమ్ములు కొడుకులు బిడ్డలు ఎవ్వల్లేరని, ఇది మూగదని తోశిన సాయం జెయ్యమని ఈ కారట్ల రాసుంది గదా! అంత అబద్ధం. దీని కందరున్నరు. అందరు గిట్టనే మూగోల్లోలె నటిస్తరు. అడుక్కుంటరు. అయ్యో అప్ప అనకుంట అడుక్కునుడుల ఇదో తీరు. కొంచెం పెద్ద తరహా బిచ్చమెత్తుకునుడు...''

నాకు ఆశ్చర్యం వేసింది.

''అవునవును శానుంట రిట్ల. నేను గూడ శాన జూశిన అని అతని ప్రక్కతను బలపరిచాడు. "ఇంతెందుకు చెప్త పటుప్రని గీడ వంగపెల్లిల కొన్నొద్దిజులు హెడ్మాష్టరుగ పన్జేశింటి. ఓ రోజు గిట్నే ఓడొచ్చిండు. కొంద నాల్కె లేదని మూగోన్నని సైగల్జేస్తె నిజమే గావొచ్చని నమ్మినం. మేం టీచర్లం ఒక్క రూపాయేసుకున్నం. పోరగాల్ల దగ్గర్నించి తలో పది పైసలడిగిచ్చినం. మొత్తం ఇర్వయి ముప్పయి రూపాయలైతె యేసుకున్నడు అవుతల వద్దకు. బడి యిడిశి పెట్టినంక, ఇంటికె పోవుకుంట మధ్యల చా' తాగుదామనిపిచ్చి హోటల్లకు పొయ్యేవరకేయున్నది? ఆడ వీడున్నాడు. రెండు మూడు రూపాయల బిల్లు జేశిండంట సర్వారుతోని నవ్వుకుంట బాతాఖాని పెడ్తాండు. నన్ను జూడంగనె ఏమని పిచ్చిందో సట్న లేశి బిల్లిచ్చి స్టేషన్ దిక్కు పోడెందుకు? ఇగ ఆగకుంట పొయ్యిండు......పొద్దుగాల బడికొచ్చి నట్టు, చింపిరి గుడ్డలతో నెందున్నడు? లేడు. మంచిగ పైంటు షర్టు యేసుకున్నడు. చేతిల బ్యాగు. సంకల ట్రాన్సిస్టరూ జోరుగుండె. అట్ల మోసం జేసే టోల్లున్నరు. ఇయ్యాల్రేపు. ఇగ మేం దివానగాండ్ల మైతిమి అని అన్కోని ఊకున్న''

'అయ్యో అయ్యో ఇగ జెప్పేదున్నాది. ఇయ్యాల్రేపు మోసాలకు లెక్కలేదు'

ముసలిది తిరిగొచ్చింది. దండం పెట్టింది. చెయ్యి చూపింది.

అందరూ నవ్వారు ఆది ముఖం మూడ్చుకుంది. తన అద్దముక్క లేవని సైగజేసింది. ఎవరూ చప్పుడు చెయ్యలేదు తెల్ల బట్టలతని పేపరు వైపు చూసారు. ముసలిది అతని వైపు తిరిగి దండం పెట్టింది.

"ఇగో నువ్వు నఖ్రాల్ జెయ్యకు. సక్కగ మాట్లాడు. నీకారట్లు నువ్ దీస్కో"-అని అన్నాడతను.

మళ్ళీ నవ్వారందరు.

'మాట్లాడు-మాట్లాడు'-కొందరు ప్రోత్సహించారు.

ఏదో అస్పష్టంగా శబ్దం చేస్తూ అందర్నీ చూస్తూ చేతులు జోడించింది.

"ఆఁ-ఆ - రానీ రానీ''

''కూత కొంచెం కొంచెం తీస్తోంది''-అంటున్నారు. నవ్వుల్లోంచి తేరుకుని.

"ఇగో నియ్యేడికి పోలె. ఇండ్లనే దాశిన''-అని పేపరు చూయించాడు. "పెద్ద పెద్ద లీడర్లకన్న ఎదిరి సూడరు గని-సూశినవా నువ్వు మాట్లాడ్త వంటె ఈడ ఎందరు సూస్తున్నరు-పోనీ నువ్వు గన్క మాట్లాడ్తే రూపాయిస్త. గఫ్ చిప్‌గా మాట్లాడు. రూపాయి తీస్కోని ఫో-యింక ఆల్కం చేస్తున్న కొద్ది పెట్టెల అందర్కీ తెలుస్తది. ఇగ ఎవలూ పైస లెయ్యరు.'' బెదగరిస్తున్నట్లుగా బెదిరించి పేపర్లోకి వెళ్ళిపొయ్యాడతను.

ముసల్ది ముసిముసిగా నవ్వుతూ చెయ్యిచాపింది-అతడు తప్పదన్నట్లు తల విదిలించాతు. చాలాసేపు గడిచింది. రైలు ఘట్‌కేసర్ స్టేషన్ ప్లాట్ ఫాం మీద ఆగబోతోంది.

"అయ్య నీకాల్మొక్త. ఎందుకు నిలవెడ్తవ్? ఇయ్యి పోత"-
అని అతని కాళ్ళు మొక్కింది ముసల్ది.

'ఎహే నీ నిజస్వరూనం బయట పెట్టాను తెలుసా అన్నట్లు అతను విజయ గర్వంతో వికటంగా అట్టహాసం చేసాడు. చుట్టు పక్కలున్న వాళ్ళు కూడా ముసలిదాన్ని చూస్తూ గోలగా నవ్వారు.

ముసలిదాని ముఖం చూసాను-అమాయకంగావుంది

నమ్మించడానికి కాబోలు పొడుగ్గా కుంకుం బొట్టు పెట్టింది,

అతను అట్ట ముక్కలు దానివి దానిమ్మిచ్చేసి 'ఫో' అన్నాడు. "ఏదో ఎడ్డి దాన్నంటె ఐదు పది పైసలిస్తరు. నువ్వేమో మాడాత్తే రూపాయిస్త నంటివి"-దండం పెడ్తూ చెయ్యి చాపింది.

"ఛీ-ఫో- దొంగ ముండ-పబ్లిక్‌ను మోసం జేసుకుంట బత్కే దానివి-నీకు రూపాయా?" కసిరాడతను.

ఆక్షణం 'మోసం' ఎవరిదో?- ఆలోచనలో పడ్డాను. రైలు పూర్తిగా ఆగింది.

గిరుక్కున వెనక్కి తిరిగి ముసలిది దిగి పోయింది-కుష్టువాళ్ళు అంతకు ముందే ఎప్పుడు దిగారో-తలుపు తెరిచి వుంది,

అయ్యా! క్రాసింగ్. ఉందండి, క్రాసింగ్. బండి ఇప్పుడే పోదండి టైం పాస్ పల్లీ బటాన!

ముచ్చటా ముచ్చటా! మీకు నాకూ ముచ్చట. మూతికి చేతికి ముచ్చట!!

గరం గరం పలీ...య్- సార్ టైం పాస్.

వజ్రాలు రత్నాలు ముత్యాలు పల్లీల్సార్–" పల్లీల బుట్టతో ప్రత్యక్షమై, స్వంత యింట్లో తిరిగినంత స్వేచ్ఛగా కంపార్టు మెంటంతా తిరుగుతూ, వేరు శనగ పలుకుల కుర్రాడు సాగిపొయ్యాడు.

కిటికీ దగ్గర తెల్ల బట్టలతను సీటు మీద పేపరు పరచి చూస్తూం డమని నాకు చెప్పి దిగాడు. లంబాడి స్త్రీలు దిగారు. మరి కొందరు కూడా దిగారు. విశ్రాంతిగా కూర్చోవడానికి స్థలం దొరికింది. ఊపిరి తీసుకుంటున్నట్టుగా ఫీలయ్యాను.

పక్కతను గడియారం చూసుకుని మరో అరగంట, నలభై నిమిషాల్లో సికింద్రాబాద్ చేరతాం అని గుర్తు చేసాడు.

రైలు మెల్లగా మళ్ళీ కదులుతోంది.

"పల్లీల పోరడు సూశినవా అన్కి గిరాకి గావాల్నని ఐండిప్పుడే పోదని శెప్పిండు– ముండకొడుకూ" ఎవరో మధ్య వయస్కుడు ప్రకటించాడు.

కిటికీ తెల్లబట్టలతను వచ్చాడు. పేపరు చేతిలోకి తీసుకుని కూర్చుని, చేతిలోని టికెట్టు తృప్తిగా చూసుకొని జేబులో పెట్టుకున్నాడు.

"రోజు ఈడదిగి టికెట్టు కొనాలంటె పెద్ద యిదయితుంది– కని యేం జెయ్యాలె తప్పదు."

"రోజు ఏణ్ణించి ఒస్తరు? పక్కతను అడిగాడు.

"రోజా?– రోజు జనగాం నించి ఒస్త– నెలకు ఒక్కసారే సీజన్ టికెట్ తీశిన, కని సీజన్ టికెట్ మీద బరువులు కొంట వోరాదు– అగో అదున్న పాలడబ్బాలు, బియ్యం సంచులు నాయె. పట్నం తీస్కపోతాన.

మన ఊల్లల్ల ఐతె ఏం అమ్ముతం? పట్నం లైతె ధర బాగవడ్తది. రోజు రెండొందల మాలు తీస్కవోత"

"మధ్యల చెకింగయితే?"

"మధ్యలయితె, అన్ని మనం సూస్కో వొచ్చు. గని సికింద్రాబాద్ టేషన్లంటె కష్టం. చెకింగ్ జేశెటోల్లు శానమందుంటరు. అండ్ల మనకు తెల్సినోడు వుండె- వుండకపాయె. అంద్కే- ఈడదిగి అర్వయి పైసల టికెట్ దీశిన. ఇగ గీటికెట్ మీద ఎంత సామాను తీస్కపోయినా ఏంగాదు. ఎన్నించి తెస్తాన వంటె ఘట్కేసర్ నించి తెస్తాన అని శెప్తే అయిపాయె. ఇగ యేం జేద్దాం. ఇయ్యాలేప్రిపు ఐక్కడు కష్టం వుంది. ఆడో రూలు దీస్తే దానికి మనం ఎత్తుకు పై ఎత్తెయ్యాలె..."

ఇంతకు ముందు ముసలిదాన్ని చూసి అతడు నవ్వినట్లు అతన్ని చూసి నవ్వాలనిపించింది-ముసలిది చాలా నయం అనిపించింది.

అతను పేపరు రాజకీయాల్లోకి దూరాడు మళ్ళీ-

ఇంతలో నిలబడ్డ వాళ్ళలో ఒకతను చప్పట్లు చరిచి-

"చూడండి బాబులు వొచ్చే యిన్‌టేషన్ దాక, ఉత్తగ కూసుంటే పొద్దు పోదండి- టైం పాస్ చేస్తమండి. అయ్యా ఇది హర్రాజ్ ఏక్షన్ అండి. దర బడితె మాల్‌యిస్త మండి. లేకుంటె కమీషన్ ఇస్తం సార్..." వాడి ధోరణిలో వాడు పడ్డాడు.

"అంత సస్త మాలు హర్రాజ్ చేస్తరు"- గొణిగింది ఓ పడచు- మూతి తిప్పుతూ.

ఎవరి తాహతును బట్టి వాళ్ళు, ఎవరి అవకాశాల్ని వాళ్ళు ఉపయోగించు కునేందుకు వీలుగా వుంది. సమాజం రైలు డబ్బా-

మరో వైపు ముసలి వాడికి కిటికీ దగ్గర సింగిల్‌సీట్ దొరికింది. గొంగడి సీటు మీద వేసుకుని, కర్ర పట్టుకుని కూర్చున్నాడు. ఉమ్మి బయట పడలేదు. శుభ్రంగా నున్నగా వున్న కిటికీ అద్దం మీద వెడల్పుగా, జిగురుగా అసహ్యంగా పడింది.

ఉమ్మి ఈసారి ఎవరి మీద పడలేదు కనుక అవతలవైపు నుండి తిట్లు సరఫరా కావడం లేదు.

ఎంతటి అసహ్యపు పనైనా గప్‌చిప్‌గా చేసి పట్టించుకోకుండా వుంటేసరి- అన్నట్టు ముసలాడు బుద్ధిగా తెల్లబట్టలతని లాగా దర్జాగా కూర్చున్నాడు.

చూస్తూ వూరుకునే నాలాంటి వాళ్ళంతా- మూగవాళ్ళే- ఇది మూగ మోసం.

రైలు వేగం పుంజుకుంటోంది. పత్రికల్లో కనిపించే ప్రగతిలా రైలు లయబద్ధంగా భయంకరంగా ధ్వని చేస్తోంది- తెలిసి తప్పు చేస్తున్న వారి గుండెలా.

రైలు కూతేసింది- కర్తవ్యం మరిచిన నినాదాల్లా.

ఆంధ్ర జ్యోతి
17-9-1976

కథా నిలయం
శ్రీకాకుళం